





తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ






తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 173 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ బుధవారం- 20 - మే - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam, VishakaPatanam, Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,


## కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు..



వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ హయాంలో దళితులపై జరిగిన దాడులు మర్చిపోలేనివని చెప్పుకొచ్చారు.

కృష్ణాజిల్లా, (మచిలీపట్నం) మే 19 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో దళితులపై జరిగిన దాడులు మర్చిపోలేనివని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళితుడు సుబ్రహ్మణ్యం నాల్గోవర్ధంతి మచిలీపట్నం బలరామునిపేటలోని మిగతా..2లో

## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం కొత్త హెల్త్ స్కీమ్




మెరుగైన వైద్య సేవల కోసం కొత్తగా

"ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్" ఏర్పాటు

అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ

కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను సమర్పించాలి

హైదరాబాద్ : ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా "ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్"ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది. మిగతా..2లో

## బండి సంజయ్ రాజీనామా చేయాలనడం సరికాదు



- బండి సంజయ్‌ని పదవి నుంచి దించాలని సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారని విమర్శ
- అది మంచి పద్ధతి కాదన్న మల్లు రవి
- కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని నిలదీత

హైదరాబాద్: బండి సంజయ్‌ని కేంద్రమంత్రి పదవి నుంచి దించాలని, రాజీనామా చేయించాలని సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మల్లు రవి అన్నారు. కానీ అది మంచి పద్ధతి కాదని అన్నారు. ఆయనను పదవిలో నుంచి దించేస్తే తాము వస్తామని కొందరు భావిస్తున్నారని ఆరోపించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కుమారుడు బండి భగీరథ్ తప్పు చేస్తే

# పాలమూరు ప్రాజెక్టులపై సీఎం రేవంత్ ఫోకస్.

- భూసేకరణ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్ష.
- పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం సిద్ధం: సీఎం



హైదరాబాద్, మే 19 (వార్త నిర్భయం) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి కూడా వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## కేసీఆర్ హయాంలో ఆ ప్రాజెక్టుకు భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారు..



- పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.
- దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు.

హైదరాబాద్, మే 19 : పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. (మంగళవారం) సచివాలయంలో మిగతా..2లో


## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని విమర్శ



ఢిల్లీ : భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు. "భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్‌ల చుట్టూ భద్రత ఉంటుంది. మిగతా..2లో

## సెప్టెంబర్ లో భారత్ కు రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక



- భారత్‌లో రష్యా అధ్యక్షుడి పర్యటన ఖరారు
- సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరిగే బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీకి రానున్న పుతిన్
- ఈ ఏడాది బిక్స్ సదస్సుకు నేతృత్వం వహిస్తున్న భారత్

## వారి త్యాగాల వల్లే మార్చి 31 కంటే ముందే నక్సలిజాన్ని నిర్మూలించాం

- బస్తర్ నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం అందరికీ గర్వకారణమన్న అమిత్ షా
- అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమేనని వ్యాఖ్య



ఢిల్లీ : భద్రతా బలగాల ధైర్యసాహసాలు, త్యాగాల వల్లే నిర్దేశిత గడువు 2026 మార్చి 31 కంటే ముందే దేశం నుంచి నక్సలిజాన్ని అంతం చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన 26వ సెంట్రల్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బస్తర్ నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం అందరికీ గర్వకారణమని అన్నారు. కేంద్రం చేపట్టిన నక్సల్స్ రహిత పోరాటానికి చాలా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమకు కనీస సహకారం అందించలేదని ఆరోపించారు. 2023 డిసెంబరు 13న ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ సర్కార్ ఏర్పడిన వెంటనే బస్తర్‌లో మిగిలిన నక్సలైట్లను ఏరివేశామని అమిత్ షా తెలిపారు. బస్తర్ ప్రజలు ఇప్పుడు నిర్భయంగా జీవిస్తున్నారన్న ఆయన, ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన 'వీర్ గుండాధర్ సేవా డేరా' కార్యక్రమాన్ని కొనియాడారు. మిగతా..2లో

## ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం రూ. 919 కోట్లు విడుదల చేశాం



- నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేశామన్న సత్యకుమార్
- 785 ప్రైవేట్ ఆసుపత్రులకు నిధులు అందాయని విడుదల
- ఇప్పటి వరకు మొత్తం రూ. 5,556 కోట్లు విడుదల చేశామని వెల్లడి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవల బలోపేతం దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం ప్రభుత్వం రూ. 919.13 కోట్లను విడుదల చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో భాగంగా

## మగవాళ్లు వేటకు వెళ్తే మహిళలు సీవీడ్ పండించాలి

- నెల్లూరు జిల్లాలో 'మత్స్యకారుల సేవ' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- చరిత్రలో తొలిసారిగా రూ.260 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశామని వెల్లడి
- 1,30,796 కుటుంబాలకు ఆర్థికసాయ చేశామని స్పష్టం



అమరావతి : తీరం మనదే. బోటూ మనదే. వేటా మనదేనంటూ సీఎం చంద్రబాబు మత్స్యకారులకు భరోసా ఇచ్చారు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదన్నారు. ఎవరి కోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లా తుమ్మలపెంట వేదికగా 'మత్స్యకారుల సేవ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ చరిత్రలో తొలిసారిగా 260 కోట్లు రూపాయలను మత్స్యకారుల ఖాతాల్లో వేసినట్లు తెలిపారు. మన సరిహద్దుల వరకూ ఎన్ని చేపలుంటే అన్నీ పట్టుకోవచ్చని అలానే విదేశీ మార్కెట్లకు ఉత్పత్తి, ఎగుమతి చేయవచ్చునన్నారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80 శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతుందని సీఎం తెలిపారు. మిగతా..2లో

## స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు



- వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్న షర్మిల
- బటన్లు నొక్కినంత మాత్రాన మళ్లీ సీఎంలు కాలేరని ఎద్దేవా
- వైఎస్సార్ ఆశయాలను నాశనం చేశారని మండిపాటు

అమరావతి : వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొదటి పేజి తరువాయి

## స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు

వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని 'ఒక్క ఛాన్స్' అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి నాడు ఉందని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తండ్రి ఆశయాల పేరిట ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆ ఆశయాలనే జగన్ నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ సీఎం అయ్యాక కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తల ఊపుతూ, అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు.

## వారి త్యాగాల వల్లే మార్చి 31 కంటే ముందే నక్సలిజాన్ని నిర్మూలించాం

"బస్తర్ ప్రజల్లో ఇప్పుడు భవిష్యత్తు పట్ల ఆత్మవిశ్వాసం, భరోసా వాతావరణం కనిపిస్తోంది. భయానక వాతావరణం, తుపాకుల నీడలో బతకాల్సిన పరిస్థితులు ఇప్పుడు ముగిసిపోయాయి. ఎట్టకేలకు బస్తర్ స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటోంది. బస్తర్ నక్సల్ రహిత ప్రాంతంగా మారడం మనందరికీ ఎంతో సంతోషకరమైన విషయం. 2024 ఆగస్టు 24న జరిగిన ఒక సమావేశంలోనే 2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేస్తామని ప్రకటించాం. భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, త్యాగాల ఫలితంగా మార్చి 31 గడువు తేదీకి ముందే నక్సలిజం పూర్తిగా నిర్మూలించాం. కాగా, 2023 డిసెంబర్ 13న విష్ణు దేవ్ సాయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. అంతకుముందు ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండేది. నక్సల్ రహిత ఉద్యమంలో బీజేపీయేతర ప్రభుత్వాలు చాలా వరకు మాకు మద్దతు ఇచ్చాయి, కానీ ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాకు మద్దతు ఇవ్వలేదు."

అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

### 'అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే'

"నక్సల్ బరి నుంచి నక్సలిజం విస్తరించడం మొదలైనప్పటి నుంచి దానికి మద్దతిచ్చే మేధావులు ఒక వాదన వినిపిస్తూ వస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగనందు వల్లే నక్సలిజం ఉద్భవించిందని చెబుతున్నారు. కానీ అది నిజం కాదు. వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే అని స్పష్టంగా అర్థమవుతుంది. దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల కంటే కూడా వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయి. కానీ అక్కడ నక్సలిజం పుట్టలేదు. ఆ ప్రాంతాలు క్రమంగా అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తున్నాయి. మన బస్తర్, ఇతర నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి." అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం కొత్త హెల్త్ స్కీమ్

ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఆర్థిక శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్-హెచ్ఆర్ పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సమాచారం నమోదు చేయాలని లేదంటే భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## బండి సంజయ్ రాజీనామా చేయాలనడం సరికాదు

బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలనడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా చట్టానికి లొంగిపోయేలా చేసి బాధ్యతాయుతంగా వ్యవహరించారని కితాబిచ్చారు. మద్యం పాలసీ కేసులో కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు అన్నాక తప్పు చేస్తారని, కానీ దానిని రాజకీయం చేయడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా సరెండర్ చేశారని గుర్తు చేశారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం రూ. 919 కోట్లు విడుదల చేశాం

ఈ నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేసినట్లు ఆయన వివరించారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 785 ప్రైవేట్ ఆసుపత్రులకు ఈ నిధులు అందాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రైవేట్ ఆసుపత్రులకు మొత్తం రూ. 5,556 కోట్లను చెల్లించామని, బకాయిల చెల్లింపుల హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పునరుద్ఘాటించారు. దీనికి సంబంధించిన నివేదికను ట్రస్టు సీఈఓ చక్రధరబాబు మంత్రికి అందజేశారు.

## కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు..

ఎస్సీ కాలనీలో ఈరోజు (మంగళవారం) జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు, కాలనీలోని దళిత ప్రముకులతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

### డా. సుధాకర్‌ని పిచ్చోడిని చేసి చంపేశారు..

జగన్ హయాంలో ఒక్క దళితులనే కాదని.. బీసీలు, మైనార్టీలు కూడా పెద్దఎత్తున దాడులకు గురయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రస్తావించారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళితుడు సుబ్రహ్మణ్యంను డోర్ డెలివరీ చేశారని ధ్వజమెత్తారు. నాడు ఆ కేసును తారుమారు చేసేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును నిష్పక్షపాతంగా విచారిస్తుంటే సాక్షులను ట్యాంపర్ చేసే ప్రయత్నాలు చేశారని చెప్పుకొచ్చారు. మాస్క్ అడిగిన పాపానికి డా. సుధాకర్‌ని పిచ్చోడిని చేసి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

### కూటమి ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ..

శాండ్‌లో అవినీతి జరుగుతోందని ప్రశ్నించిన ఓం ప్రకాష్‌ను ఉరివేసి చంపేశారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని తెలిపారు. జగన్ హయాంలో హత్యకు గురైన బీసీ సోదరుడు తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించామని అన్నారు. నేడు మళ్లీ జగన్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. అధికారులకు కులాలు అంటగట్టి దూషిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ చనిపోతే రాజకీయం చేయాలని చూశారని... వీటన్నింటినీ ప్రజలు గమనించాలని కోరారు. అన్నివర్గాలు సంఘటితమై ముందుకు సాగాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

## 18 నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాలి రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

**ఏటా 9 లక్షల మోటార్‌సైకిళ్లను ఉత్పత్తి చేస్తామని ప్రతినిధుల హామీ**

**చంద్రబాబుకు బుల్లెట్ 350 నమూనా - రూ. 2,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న బుల్లెట్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్‌సైకిల్ తయారీ ప్రాజెక్టును 18 నెలల్లో పూర్తి చేసి, ఉత్పత్తిని ప్రారంభించాలని ఆయన నిర్దేశించారు. ఈ ప్రాజెక్టు విజయవంతంగా అమలు అయ్యేలా చూడటానికి, రాష్ట్ర ప్రభుత్వం సాధ్యమైన ప్రతి సహాయాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని ఆయన కంపెనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. రూ. 2,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న బుల్లెట్ : ఈ సందర్భంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ జజూూ గోవిందరాజన్ నేతృత్వంలోని ఒక ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసింది. తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం, రల్లకుప్పం ప్రాంతంలో రూ. 2,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న బుల్లెట్ మోటార్‌సైకిల్ తయారీ ప్లాంట్‌కు సంబంధించిన వివరాలను వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఆధునిక సదుపాయాలు కూడా అందుబాటులో : ప్రతినిధి బృందం అందించిన వివరాల ప్రకారం ఈ ప్లాంట్ ద్వారా ఏటా 9,00,000 మోటార్‌సైకిళ్లను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అత్యాధునిక తయారీ యూనిట్‌తో పాటు ఈ ప్రాంగణంలో ప్రత్యేక టెస్టింగ్ ట్రాక్, పరిశోధన, అభివృద్ధి కేంద్రం, వెండర్ పార్క్ వంటి అనేక ఆధునిక సదుపాయాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 15,000 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. అనే ఎలక్ట్రిక్ మోడల్ : ముఖ్యంగా సమీప భవిష్యత్తులో 'అనే ఎలక్ట్రిక్ మోడల్‌ను విడుదల చేయాలని తమ కంపెనీ యోచిస్తోందని కూడా రాయల్ ఎన్‌ఫీల్డ్ బృందం ప్రస్తావించింది. ఈ సమావేశంలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన వివిధ ప్రోత్సాహకాలు, సదుపాయాల పట్ల వారు తమ ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350 నమూనాను అందుకున్నముఖ్యమంత్రి : ఈ భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350 నమూనాను బహుమతిగా స్వీకరించారు. ఆ నమూనా వాహనాన్ని పరిశీలించారు. అనంతరం, ఆయన హెల్మెట్ ధరించి, ఓ వాహనంపై కూర్చుని, మోటార్‌సైకిళ్ల పట్ల తనకున్న ప్రత్యేక ఆసక్తిని చాటిచెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన పారిశ్రామిక అభివృద్ధికి , ఉపాధి అవకాశాలకు ఒక కేంద్ర బిందువుగా మారడంతో పాటు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయడానికి ఈ ప్రాజెక్టు సిద్ధంగా ఉంది.

## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

మొదటి పేజి తరువాయి

భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేం చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాలను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోదీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోదీ స్వయంగా విదేశాలకు వెళ్తున్నారు."

రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు



ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

'రైతులు నాశనమవుతారు- పేదలు తుడిచిపెట్టుకుపోతారు'

"ప్రజలు మేల్కొని రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి. మీరు ఈ ప్రభుత్వాన్ని మార్చకపోతే ఈ దేశం మనుగడ సాగించదు. ఎంజీఎన్ఆర్ఈజీఏ రద్దు చేస్తారు. రైతులు నాశనమవుతారు. పేదలు తుడిచిపెట్టుకుపోతారు. కానీ మోదీ, అమిత్ షా సహా దేశ నాయకులందరూ అంబానీ ఇంట్లో జరిగిన పెళ్లికి హాజరవుతుంటారు. గతంలో ప్రజలు తమ ఇంటి పొదుపును తమ ఇళ్లలోనే ఉంచుకునేవారు. అయితే, ఇప్పుడు మోదీ ఆ డబ్బును మీ జేబుల నుంచి దోచుకుని అదానీ, అంబానీలకు, తన అనుచరులకు అప్పగించారు. వారు జీఎస్టీ పేరుతో నిధులను పక్కదారి పట్టిస్తున్నారు." అని రాహుల్ గాంధీ అన్నారు. రెండు రోజుల పర్యటన కోసం ఉత్తర్ ప్రదేశ్ కు వచ్చిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలైన రాయ్‌బరేలీ, అమేఠీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం లఖ్ నవూ విమానాశ్రయంలో దిగిన ఆయన, అక్కడి నుంచే నేరుగా తన నియోజకవర్గమైన రాయ్‌బరేలీ వెళ్లారు. విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్, ఇతర నేతలు స్వాగతం పలికారు.

## మగవాళ్లు వేటకు వెళ్తే మహిళలు సీవీడ్ పండించాలి

మొదటి పేజి తరువాయి

మత్స్యకారుల సాహసానికి సముద్రమే వేదికని సీఎం చంద్రబాబు అన్నారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచుతామని అలానే వీరి పిల్లలకు స్కిల్స్ నేర్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై సంతృప్తి ఎక్కువగా ఉన్న జిల్లా నెల్లూరు జిల్లా అని కొనియాడారు. మెదటిసారి నెల్లూరు జిల్లాలో 2 పంటలకు నీళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే డబ్బులని, మగవాళ్లు వేటకు వెళ్తే మహిళలు సీవీడ్ పండించాలని సూచించారు. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా పాటించాలని అన్నారు. మత్స్యకారుల పిల్లల జీవితాలు మెరుగుపడాలని అలానే మీ జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని వెల్లడించారు. "సముద్రంలో వేట నిలిచిపోతే పూట గడిచే పరిస్థితి లేదు. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. మత్స్యకారులు ఎన్నో రోజులు సముద్రంలోనే గడుపుతారు. తుపాను వస్తే కుటుంబసభ్యులకు సమాచారం కూడా ఇవ్వలేని పరిస్థితి. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. సముద్రంలో చేపల వేట చాలా కష్టమైన పని. చేపల వేటకు ఎంతో ధైర్యం కావాలి. ఉవ్వెత్తున ఎగిసిపడే అలలకు సైతం ఎదురెళ్లే గుండె ధైర్యం కావాలి. జీవనోపాధి కోసం కుటుంబాలను వదిలి రోజులతరబడి వెళ్తారు."- చంద్రబాబు, ముఖ్యమంత్రి ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు: జువ్వలదిన్నెలో అత్యాధునిక షిప్పింగ్ హార్బర్ వచ్చిందని రూ.288 కోట్లలో దీని నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. ఇప్పటికే 87 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ హార్బర్ మీ సొంతం ఫేక్ ప్రచారాలు నమ్మొద్దని చెప్పారు. సముద్ర సంపద ఉపయోగించుకోవాలని కోరారు. మన తీరంపై మనకే హక్కులు ఉంటాయని పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదని అన్నారు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుందని అప్పుడు వెంటనే అప్రమత్తమై ఎవరినీ రానివ్వమని చెప్పారు. 200 మెకనైజ్డ్ బోట్లు శాంక్షన్‌కు సిద్ధంగా ఉన్నాయని 60 శాతం సబ్సిడీతో ఇస్తాం సీఎం వెల్లడించారు. 2014-19లో మత్స్యసంపద





ఉత్పత్తి 19.18 శాతం పెరిగిందని ఆ తర్వాత వైఎస్సార్సీపీ హయాంలో 2019-24 మధ్య 4 రెట్లు పడిపోయిందని సీఎం తెలిపారు. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించామని ఇవాళ 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థికసాయం అందించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## సెప్టెంబర్ లో భారత్ కు రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ లో భారత్ కు రానున్నారు. 2026-బ్రిక్స్ సదస్సు కోసం సెప్టెంబర్ 12-13 తేదీల్లో పుతిన్ ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ మేరకు రష్యా ప్రభుత్వ కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ ఏడాది కాలంలో పుతిన్ భారత్ కు రావడం ఇది రెండోసారి కావడం విశేషం. 2025 డిసెంబర్ లో జరిగిన 23వ భారత్ , రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఇరుదేశాల సంబంధాల బలోపేతంపై ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపారు. అలాగే, బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకొవ్ తెలిపారు. కాగా, ఈసారి బ్రిక్స్ సదస్సుకు భారత్ నేతృత్వం వహిస్తోంది. ఈ సంవత్సరం భారతదేశ బ్రిక్స్ సదస్సుకు సంబంధించి దేశవ్యాప్తంగా అనేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో పుతిన్ భారత్ కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతేడాది బ్రిక్స్ సదస్సు బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో జరిగింది.

**ప్రధాని మోదీతో భేటీ అయిన రష్యా విదేశాంగ మంత్రి**



ఇదిలా ఉండగా, ఇటీవలే రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారత్ లో పర్యటించారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం, ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. మే 14న జరిగిన ఆ సమావేశంలో భారత్- రష్యా ద్వైపాక్షిక సహకారం, అంతర్జాతీయ పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా పరిణామాలు వంటి కీలక విషయాల గురించి చర్చించారు.

అనంతరం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో సెర్గీ లావ్రోవ్ మాట్లాడారు. చర్చల సందర్భంగా ప్రధాని మోదీ కూడా ఈ ఏడాది చివర్లో రష్యాలో పర్యటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, వ్యూహాత్మక భాగస్వామ్య విస్తరణపై రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. భారత్‌తో తమకు ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు మాస్కో కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. "బ్రిక్స్ సదస్సు కోసం మేం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించాం. ఈ ఏడాది రష్యా పర్యటన తన వంతు అని ప్రధాని మోదీ ధ్రువీకరించారు. అత్యున్నత స్థాయి సమావేశాల కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి" అని లావ్రోవ్ పేర్కొన్నారు. ఇక, భారత్ అధ్యక్షతన జరగనున్న 2026 బ్రిక్స్ సదస్సుకు 'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ' అనే థీమ్‌ను నిర్ణయించారు. అంటే స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం ప్రధాన లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. 2025లో బ్రెజిల్‌లోని రియో సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీ ప్రస్తావించిన 'మానవతా దృక్పథం, ప్రజాకేంద్రిత వృద్ధి' భావజాలాన్నే ఈ థీమ్ ప్రతిబింబిస్తోందని బ్రిక్స్ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. బ్రిక్స్ లో ఎన్ని దేశాలు ఉన్నాయంటే! బ్రిక్స్ కూటమి విషయానికొస్తే, తొలుత బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా ఈ వేదికలో భాగమవగా, ఆ తర్వాత ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా సభ్యదేశాలుగా చేరాయి. దీంతో ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో మొత్తం సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. ప్రపంచంలోని 11 దేశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా బ్రిక్స్ ఒక ప్రభావవంతమైన కూటమిగా అవతరించింది. ప్రపంచ, ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగిన సమకాలీన సమస్యలు, అలాగే ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిపాలనకు సంబంధించిన అంశాలపై సంప్రదింపులు, సహకారం కోసం ఇది పనిచేస్తుంది.

## యాదాద్రిలో తెలంగాణ కేబినెట్ భేటీ..? రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ

మొదటి పేజి తరువాయి



### బాసర అంత్య పుష్కరాల ప్రభావం..

రాష్ట్రంలో అత్యంత పవిత్రమైన, చరిత్రాత్మక ఆధ్యాత్మిక వేడుకగా భావించే 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరుకానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది.

### నిమగ్నమైన యంత్రాంగం..

మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

### యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట (యాదాద్రి)లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు.

### గతంలో మేడారంలో కేబినెట్ భేటీ..

రాజధాని హైదరాబాద్ వెలుపల కేబినెట్ భేటీలు నిర్వహించడం సీఎం రేవంత్‌రెడ్డికి ఇది కొత్తేమీ కాదు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క - సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలోనే కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్టలోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు.

తనదైన శైలిలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాలు..

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనదైన శైలిలో నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్తోంది. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. మేడారంలో సాధించిన విజయవంతమైన అనుభవంతో, ఇప్పుడు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా తెలంగాణ కేబినెట్ ఎలాంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోబోతుందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఈ పరిణామం అటు ఆధ్యాత్మిక రంగంతో పాటు ఇటు తెలంగాణ రాజకీయాల్లోనూ పెద్ద ఎత్తున ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

కేసీఆర్ హయాంలో ఆ ప్రాజెక్టుకు భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. కింద జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## ఖాతాలోకి డబ్బులు - 100 బోట్లలో ర్యాలీగా వచ్చి ప్రభుత్వానికి మత్స్యకారుల కృతజ్ఞతలు

**మత్స్యకారుల సేవలో రెండో ఏడాది నిధులు -**

**కృతజ్ఞతగా బోట్ల ర్యాలీ**

**మత్స్యకారులకు లోకేశ్ ఆత్మీయ స్వాగతం - మాట మీద నిలబడే తత్వం మత్స్యకారుల నుంచే నేర్చుకోవాలన్న మంత్రి**

'మత్స్యకారుల నుంచే మాట మీద నిలబడే తత్వం అందరం అలవర్చుకోవాలి' అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'మత్స్యకారుల సేవలో' రెండో ఏడాది నిధుల విడుదల సందర్భంగా వంద బోట్లపై వచ్చిన మత్స్యకారులు సీఎం, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారులను ఇంటికి ఆహ్వానించిన మంత్రి లోకేశ్ వారితో ఆప్యాయంగా మాట్లాడి ఆత్మీయ ఆతిథ్యం అందించారు. మత్స్యకారుల నుంచే మాట మీద నిలబడే తత్వాన్ని అందరూ అలవర్చుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమం కింద రెండో ఏడాది నిధులు విడుదల చేసిన సందర్భంగా వెంకటపాలెం, తుమ్మలపాలెం, సీతానగరం, కుమ్మరపాలెంలకు చెందిన మత్స్యకారులు వంద బోట్లతో కృష్ణా నదిలో ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రికి, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంటికి రమ్మని ఆహ్వానం: బోట్లపై వచ్చిన మత్స్యకారులను ఇంట్లో నుంచి చూసిన మంత్రి లోకేశ్ వారికి అభివాదం చేస్తూ ఇంటికి రమ్మని ఆప్యాయంగా ఆహ్వానించారు. అంతా కలిసి ఒక్క మాట అనుకుంటే, దానిపై మత్స్యకారులు నిలబడతారని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రం ఎంత ధ్వంసమైందో అందరూ చూశారని, అయినా మత్స్యకారులు ఎన్ని కష్టాలు పడినా పిల్లలను బాగా చదివిస్తున్నారని ప్రశంసించారు.

ఖాతాలోకి డబ్బులు - 100 బోట్లలో ర్యాలీగా వచ్చి ప్రభుత్వానికి మత్స్యకారుల కృతజ్ఞతలు

'మత్స్యకారుల పట్టుదలే వేరు. యువగళం పాదయాత్రలో మీరు చూపించిన క్రమశిక్షణ ఎన్నటికీ మర్చిపోలేను. మాట మీదే నిలబడుతారు. మీలో ఐక్యత చాలా గొప్పగా ఉంటుంది. మీ నుంచి మేము చాలా నేర్చుకోవాలి. మత్స్యకారుల కోసం ప్రభుత్వం మెరుగైన సేవలందిస్తుంది. మీకేం కావాలన్నా ధైర్యంగా అడగొచ్చు. ఇది మన ప్రభుత్వం, ఏ సమస్య వచ్చినా మీరు ఇక్కడికి రావచ్చు. ఎలాంటి సహాయమైనా అడగొచ్చు.' -లోకేశ్ , మంత్రి జువ్వలదిన్నెలో డిఫెన్స్ కంపెనీ: పిల్లలకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రపంచం మొత్తం తిరిగి కంపెనీలు తీసుకొస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగానే జువ్వలదిన్నెలో డిఫెన్స్ కంపెనీకి శంకుస్థాపన చేశామన్నారు. తమిళ జాలర్లు మన వైపు రాకుండా, వాళ్లకు మనకు మధ్య సర్వేలెన్స్ కోసం అటానమస్ పెట్రోలింగ్ బోటును సాగర్ డిఫెన్స్ కంపెనీ ఏర్పాటు చేయనుందని వివరించారు. మా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి: మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య అయినా ఎప్పుడూ తమ ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని మంత్రి హామీ ఇచ్చారు. ఇంట్లో కూర్చోబెట్టుకుని మత్స్యకారులందరితోనూ ఆప్యాయంగా మాట్లాడి ఫొటోలు దిగారు. తాము సీఎంకు కృతజ్ఞతలు చెప్పడానికి వస్తే మంత్రి లోకేశ్ తమకు ఆత్మీయ ఆతిథ్యం అందించారని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. మత్స్యకారుల సేవలో: రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఈ నిధులు అందిస్తున్నారు. తీరప్రాంత భద్రతతో పాటు సముద్ర జాలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది.

నిర్భయం

బుధవారం 20 మే 2026

# పాలమూరు ప్రాజెక్టులపై సీఎం రేవంత్ ఫోకస్.

**భూసేకరణ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశం**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్ష.**

**పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం సిద్ధం: సీఎం**

హైదరాబాద్, మే 19 (వార్త నిర్ణయం) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి కూడా వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు



పర్యవేక్షించాలని సూచించారు.ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారీ వ్యవస్థ కూల్చి సమసమాజ స్థాపనే లక్ష్యం

**పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి. సిపిఎం ఘన నివాళి.**

**సోషలిజం సాధనే ఆయనకు నిజమైన నివాళి**

**జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు.**

వనపర్తి బ్యూరో మే 19 (వార్త నిర్భయం) పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను కూల్చి సమసమాజం, సోషలిజం సాధించడమే పుచ్చలపల్లి సుందరయ్యకు ఘనమైన నివాళి అని సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు.సిపిఎం పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని సిపిఎం వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం. పరమేశ్వర చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి పరమేశ్వర చారి, పట్టణ కమిటీ సభ్యులు డి. కురుమయ్య తదితరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ, సుందరయ్య 1913 మే 1న నెల్లూరు జిల్లా అలగానిపాడులో భూస్వామ్య కుటుంబంలో జన్మించారని తెలిపారు. భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, పెట్టుబడిదారీ సమాజం రద్దు కోసం ఆయన పనిచేశారన్నారు. సోషలిజం స్థాపనకు ఎనలేని కృషి చేశారని, 1985 మే 19న అనారోగ్యంతో మరణించారని గుర్తుచేశారు.ఆయన జీవించినంత కాలం నిరాడంబరతకు పెట్టింది పేరని, 1952 నుంచి 1954 వరకు పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడిగా, 17 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో శాసనసభ్యుడిగా పనిచేశారని తెలిపారు. సైకిల్ పైనే ప్రయాణించేవారని కొనియాడారు. కుల వివక్ష అంతం కోసం కుటుంబంతోనే పోరాటం ప్రారంభించి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. 1932లోనే అలగానిపాడులో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారని పేర్కొన్నారు.కార్మికులను, పేదలను దోపిడీకి



గురిచేస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి సోషలిజం స్థాపించడమే సుందరయ్యకు ఘనమైన నివాళి అని అన్నారు. భారత దేశంలో సంపద కొంతమంది దగ్గరే పోగుబడుతోందని, 90 శాతం మంది పేదలుగా జీవనం కొనసాగిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగాన్ని పెంచి పోషించే వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థ అని, మహిళలపై అత్యాచారాలను సహజంగా చూసే ధోరణి ఈ వ్యవస్థలో ఉందన్నారు. కులం, మతం పేరుతో సమాజాన్ని చీల్చింది పెట్టుబడిదారీ వ్యవస్థేనని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయండి, బంగారం కొనుగోలు చేయకండి అంటూ ప్రధాని ప్రచారం చేయడం వెనుక సంక్షోభమే కారణమని అభిప్రాయపడ్డారు.పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు పెంచి పోషిస్తోందని, ఈ వ్యవస్థ మార్పు కోసం నేటి యువత, కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు డి. కురుమయ్య, జి. బాలస్వామి, జి. గట్టయ్య, ఎల్. బిసన్న, రమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి. మహేష్, నాయకులు రాబర్ట్, సిపిఎం జిల్లా ఆఫీస్ కార్యదర్శి ఉమా తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్లకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి

**- ప్రమాద బీమా, ఉచిత విద్య, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ డిమాండ్**



సూర్యాపేట బ్యూరో మే 19 వార్త నిర్భయం

సూర్యాపేట : జిల్లా లోని ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్మికుల సంక్షేమంపై పలు కీలక డిమాండ్లు వినిపించాయి. మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నాగేంద్ర బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న బస్సు డ్రైవర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేని దుస్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న నిరుద్యోగులు ఉపాధి లేక తక్కువ జీతాలతో డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, పెరిగిన నిత్యావసర ధరలతో జీవనం మరింత భారంగా మారిందన్నారు. కనీస వేతనంగా నెలకు రూ.26




వేలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రోడ్డు రవాణా చట్టాల వల్ల ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో డ్రైవర్లపై కఠిన చర్యలు పడే అవకాశాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో కార్మికులకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక విధానాలు తీసుకురావాలని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు.డ్రైవర్లకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ చేయాలని, సంవత్సరానికి రెండు జతల బట్టలు, చెప్పులు అందించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డ్రైవర్ల పిల్లలకు వారు పనిచేస్తున్న పాఠశాలల్లో ఉచిత విద్య అందించేలా యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. ప్రతి నెల సమయానికి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సాయి కుమార్, సుందరయ్య, యూనియన్ అధ్యక్షుడు నాగేంద్ర బాబు, ప్రసాద్, మామిడి సైదులు, ఖాదర్, మచ్చ సైదులు, సతీశ్, గోపాల్ దాస్, వీరయ్య, చంద్ర మోహన్, అయోధ్య, కార్తీక్, గోపి, మోహన్, శ్రీనివాస్, వీరేశం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# బడుగులు ఇండ్ల నిర్మాణం చేయవద్దా

**ఇండ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం అన్యాయం**

**టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్**



సూర్యాపేట బ్యూరో మే 19 వార్త నిర్భయం

సూర్యాపేట:బడుగులు ఇండ్ల నిర్మాణం చేయవద్దా,ఇండ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం అన్యాయమని సూర్యాపేటలో జిల్లా కేంద్రంలోని వజ్ర టౌన్ షిప్ లో బడుగు బలహీన వర్గాలు ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటే సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూకబ్జాలు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.2024లో సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నల్లు ఉమా జ్యోతి రెడ్డి, నల్లు చిత్తరంజన్ రెడ్డి పై కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రోద్బలంతో అక్రమాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాలు ఎదగకుండా అగ్రకులాలు ఆటంకం కలిగించడం ఆవేదన కలిగిస్తుందని అన్నారు. చట్టబద్ధంగా అనుమతులు తీసుకోని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామగ్రి, రాడ్లు వంటి యంత్రాలను మున్సిపల్ సిబ్బంది బలవంతంగా తీసుకెళ్లి అక్కడ ఉన్న తమ వారిని



పోలీసులు పోలీస్ స్టేషన్లో తీసుకెళ్ళి కూర్చోబెట్టడం ఎంతవరకు న్యాయమని అన్నారు. ఇది అధికార పార్టీ నాయకులు అండదండలతో పోలీసు వారు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. లక్షల రూపాయల విలువైన సామగ్రిని అన్యాయంగా మున్సిపాలిటీ తీసుక పోవడం అన్యాయమన్నారు. సూర్యాపేట రూరల్ పోలీసులు సివిల్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని ఇదే విధంగా వ్యవహరిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. చట్టపరమైన అంశాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, పేద ప్రజలు కష్టపడి నిర్మించుకుంటున్న ఇళ్లపై పరోక్షంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే అన్ని పత్రాలతో ప్రజల ముందుకు వస్తామని స్పష్టం చేశారు.భూవివాదంలో సంబంధం ఉన్న వారందరిపై సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వట్టే జానయ్య యాదవ్ డిమాండ్ చేశారు. వజ్రా టౌన్ షిప్ విషయంలో సర్వే నెంబర్లు, డిటిసిపి అన్ని రకాల అనుమతులు ఉన్నాయని మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీరు అక్బర్, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు బొల్లె సైదులు, నేలచర్ల మధు ప్రజాపతి, కుంభం వెంకన్న యాదవ్, వల్లాల సైదులు, మధు, చాప్లా, రాగం లింగయ్య, చింత సైదులు, లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## యువ న్యాయవాది మాదరి రాకేష్‌కు 'దళిత రత్న' అవార్డు.

**మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ప్రదానం**

**బెల్లంపల్లికి చెందిన దళిత గిరిజన ఉద్యమకారుడికి రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం.**

**భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా పనిచేస్తా: రాకేష్**




హైదరాబాద్ మే 19 (వార్త నిర్భయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే "దళిత రత్న" అవార్డుకు బెల్లంపల్లికి చెందిన దళిత గిరిజన ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త, యువ న్యాయవాది మాదరి రాకేష్ ఎంపికయ్యారు.మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి . డా. జి. వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా మాదరి రాకేష్ "దళిత రత్న" అవార్డును స్వీకరించారు.ఈ సందర్భంగా మాదరి రాకేష్ మాట్లాడుతూ, ఈ అవార్డుకు ఎంపిక కావడం, మంత్రి వివేక్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా సామాజిక సేవలో పనిచేస్తానని పేర్కొన్నారు.మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ న్యాయవాది మాదరి రాకేష్‌ను అభినందించారు. అనంతరం కృతజ్ఞతగా మాదరి రాకేష్ మంత్రి వివేక్ ని శాలువాతో సత్కరించారు.

## న్యాయం కోసం వెళ్లిన మహిళకు అన్యాయం

**సీఐ రాజు నాయక్‌పై తీవ్ర ఆరోపణలు.**

**పెళ్లి పేరుతో మోసం, బలవంతపు గర్భస్రావం ఆరోపణ**

**సీఐపై కేసు నమోదు, శాఖాపరమైన విచారణ.**



ఖమ్మం మే 19 (వార్త నిర్భయం) భర్త వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ వివాహితను పెళ్లి పేరుతో మోసం చేసి గర్భవతిని చేశాడని, అనంతరం బలవంతంగా గర్భస్రావం చేయించాడని ఖమ్మం కమిషనరేట్‌కు చెందిన సీఐ భూక్యా రాజు నాయక్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది.సమాచారం ప్రకారం, 2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో భర్త వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో సీఐ రాజు నాయక్ పరిచయం పెంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసులో న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా దగ్గరయ్యాడని, పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి శారీరకంగా దగ్గరయ్యాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చగా, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో సీఐ బలవంతంగా మాత్రలు మింగించాడని, దాంతో గర్భస్రావం జరిగిందని ఆమె ఆరోపించింది. పెళ్లి విషయాన్ని దాటవేస్తుండటంతో బాధితురాలు ఈ నెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు కాగా, సీఐ రాజు నాయక్ ముందస్తు బెయిల్ పొందినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పోలీసు శాఖ అంతర్గతంగా కూడా విచారణ చేపట్టింది. శాఖాపరమైన విచారణలో ఆరోపణలకు సంబంధించిన ప్రాథమిక అంశాలు వెలుగులోకి రావడంతో, ఉన్నతాధికారులు ఆయనను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు సమాచారం.ఇటీవలే బాధితురాలికి ఆమె భర్త నుంచి కోర్టు ద్వారా విడాకులు మంజూరైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆమెకు విడాకులు ఇప్పించేందుకు సీఐ రాజు నాయక్ బాధితురాలి భర్తపై ఒత్తిడి తెచ్చినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ వ్యవహారంపై ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగానే ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. కేసుపై తుది నిజానిజాలు విచారణ పూర్తయ్యాకే వెలుగులోకి రానున్నాయి.

## 60 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.9000 పెన్షన్ ఇవ్వాలి.

**సంక్షేమ బోర్డు ఫలాలు అందడం లేదని ఆవేదన.**

**ఈ నెల 25న 'చలో హైదరాబాద్'కు పిలుపు.**

**టి యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రాజు.**



వనపర్తి బ్యూరో మే 19 (వార్త నిర్భయం) 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు కనీసం రూ.9000 పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం మోట్లంపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాలు పంచి, గోడపత్రికను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఉన్నా కార్మికులకు పూర్తిస్థాయిలో ఫలితాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కార్మికులందరికీ దీూజ కార్డులు లేవని, కార్డు తీసుకున్నవారు రెన్యువల్స్ చేసుకోలేకపోతున్నారని తెలిపారు. కార్డు ఉండి రెన్యువల్ అయినా క్లెయిమ్స్ సక్రమంగా అందడం లేదని, నిరక్షరాసులైన భవన నిర్మాణ కార్మికులకు సులభంగా లబ్ధి చేకూరడం లేదని పేర్కొన్నారు.60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికుడికి దీూజ కార్డు ఉపయోగపడటం లేదని, వారికి నెలకు రూ.9000 పెన్షన్ ఇవ్వాలి. కార్మికుడిగా నెలకు రూ.1 చొప్పున సంవత్సరానికి రూ.12 చెల్లిస్తున్నా పెన్షన్ సౌకర్యం లేదని విమర్శించారు. చలి, వాన, ఎండల్లో ఆరుగాలం కష్టపడి ప్రాజెక్టులు, బిల్డింగులు నిర్మిస్తున్న జాతి నిర్మాతలకు పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుత సంక్షేమ పథకాలైన డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్, సహజ మరణం పరిహారాలను పెంచాలని కోరారు.డిమాండ్ల సాధన కోసం ఈనెల 25వ తేదీన 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మదనపురం మండలంలోని అన్ని గ్రామాల భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జి. చెన్నయ్య, పేతురు, శ్రీను, బాలకృష్ణ, శాంతన్న, అనిల్, గోవర్ధన్ పాల్గొన్నారు.

## జలమండలిలో జాక్‌పాట్..?

**జీఎం ఇంట్లో కోట్ల క్యాష్, కేజీల బంగారం స్వాధీనం.**

**రెడ్ హిల్స్ జీఎం ఎస్.ఎల్. కుమార్ నివాసంపై ఏసీబీ దాడులు**

**రూ.1.05 కోట్ల నగదు, 9 ఫ్లాట్లు, 3 ఎకరాల భూమి గుర్తింపు**

హైదరాబాద్ మే 19 (వార్త నిర్భయం) హైదరాబాద్ జలమండలిలో భారీ కలకలం రేగింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ) రెడ్ హిల్స్ విభాగం జనరల్ మేనేజర్ ఎస్.ఎల్. కుమార్ నివాసంపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు.మల్లాపూర్‌లోని వెంకటరమణ కాలనీలో ఉన్న కుమార్ నివాసంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు చేపట్టారు. తెలిసిన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.సోదాల్లో భాగంగా రూ.1.05 కోట్ల నగదు, దాదాపు ఒక కిలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, స్థిర నిక్షేపాలకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు వివరాలు, స్థిరాస్తుల డాక్యుమెంట్లు లభించినట్లు తెలిసింది. భారీగా నగదు లభించడంతో కరెన్సీ లెక్కింపు యంత్రాలతో అధికారులు డబ్బును లెక్కించారు ప్రాథమిక విచారణలో నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో తొమ్మిది ఫ్లాట్లు, ఇతర ప్రాంతాల్లో స్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మార్కెట్ విలువ ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.100 కోట్ల వరకు ఉండొచ్చని ప్రాథమిక అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్‌గా కేశవరావు నియామకాన్ని రద్దు చేయాలి : మర్రి యాదవ్ రెడ్డి







వరంగల్ ప్రతినిధి మే 19 (వార్త నిర్భయం).తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఏర్పాటు చేసిన కమిటీకి చైర్మన్‌గా కే. కేశవరావును నియమించడాన్ని ఉద్యమకారులు వ్యతిరేకిస్తున్నారని రాష్ట్ర టీజీఏ అధ్యక్షుడు, కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి పేర్కొన్నారు. వెంటనే ఆయనను తొలగించి, అర్హత కలిగిన ఉద్యమకారుల్లో ఎవరినైనా చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు.మంగళవారం వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో కరీమాబాద్‌లోని చెట్రోళ్లగడ్డ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి సంఘం కన్వీనర్ మరుపల్ల రవి అధ్యక్షత వహించారు.తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని కేశవరావును కమిటీ చైర్మన్‌గా నియమించడం అధికార పార్టీకి వత్తాసు పలకడమేనని మర్రి యాదవ్ రెడ్డి విమర్శించారు. అర్హత కలిగిన ఉద్యమకారులు ఎంతోమంది ఉన్నప్పటికీ వారిని పక్కనబెట్టి కేశవరావునే నియమించడం సరైంది కాదన్నారు.ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీలు వేసి కాలయాపన చేయడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కడానికి ప్రయత్నించిన వారే నేడు అధికారంలో కొనసాగుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో అండర్ రైల్వే గేట్ జేఏసీ కన్వీనర్ దిడ్డి నరేందర్, ఉద్యమ నాయకులు నార్ల గిరి, రమేష్, ముహమ్మద్ నైమ్, సంకు నర్సింగం, నాగవెల్లి సాంబయ్య, మిట్టపల్లి రమేష్, అబ్దుల్ పాషా, శంకేసి లింగమూర్తి, కేతిరి రాజశేఖర్, మేకల ఎల్లయ్య, దిండిగాల సోమేశ్వర్, పరదేశి రాజేష్, అంకం దేవానంద్, కెంచ ఆనంద్, కాలే యాదయ్య, సోమ మధుకర్, బస్కే రాజేందర్, ఆవునూరు లక్ష్మి, మునినిపల్లి జమున, కొండపాక రమాదేవి, పల్లకొండ యాక లక్ష్మి, చిదురాల సుజాత, కొండపాక లక్ష్మి, సోమ ఉపేంద్ర, కె. సురేందర్, ఎం. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 59 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగరాజు ...





వరంగల్ ప్రతినిధి మే 19 (వార్త నిర్భయం) జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 59 మంది లబ్ధిదారులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతోందని, ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. .ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు ఫార్మసీ షాపులు ప్రజలకు అందుబాటులో ఉంటాయి

### తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తన్నీరు రోజశ్రీ

సూర్యాపేట బ్యూరో మే 19 వార్త నిర్భయం

సూర్యాపేట: నేడు ఫార్మసీ షాపులు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తన్నీరు రోజశ్రీ తెలిపారు.మంగళవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కూర్మ శంకర్ ఆదేశాల మేరకు వారు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ఫార్మసిస్టుల ఆధ్వర్యంలో నడుస్తున్న 20 మెడికల్ షాపులు ప్రజా సేవను ప్రధానంగా భావిస్తూ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు ఎప్పటికప్పుడు మందులు అందుబాటులో ఉండేలా చూస్తున్నట్లు తెలిపారు.నేడు మెడికల్ షాపుల బంద్‌కు పిలుపునిచ్చిన కెమిస్ట్ లు, డ్రగ్గిస్టుల సంఘానికి తమ ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం మద్దతు ఇవ్వడం లేదని తెలిపారు.అర్హత కలిగిన ఫార్మసిస్టులు లేకుండా నడుస్తున్న కొన్ని షాపుల కారణంగా ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు.సూర్యాపేటలో ఉన్న మెడికల్ షాపులలో కొద్ది మంది మాత్రమే ఫార్మసీ కోర్సును పూర్తి చేసి స్వయంగా షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫార్మసిస్టులే ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ షాపుల నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు.ఈ రోజు ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెడికల్ షాపులు తెరిచే ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గద్దల సైదులు, టౌన్ అధ్యక్షులు సుంకరబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రగతిశీల భావజాలంతోనే సమస్యల పరిష్కారం.

**ఆదిలాబాద్ జిల్లా ప్రజావాణి పైలెట్ ప్రాజెక్టు నివేదిక ఆవిష్కరణ**

**మండల స్థాయికి ప్రజావాణి విస్తరణపై ప్రభుత్వ ఆలోచన.**

**అధికారులు సానుకూల ధోరణితో స్పందించాలి: సీఎం ప్రజావాణి ఇంచార్జ్**

హైదరాబాద్ మే 19 (వార్త నిర్భయం) ప్రగతిశీల భావజాలం ఉంటే ప్రజావాణికి వచ్చే సమస్యల మూలాలు అర్థమై వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో ప్రజావాణి అమలు తీరుపై పైలెట్ ప్రాజెక్టు నివేదికను చిన్నారెడ్డి , సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణికి వివిధ సమస్యలతో వచ్చే దరఖాస్తుదారుల పట్ల అధికారులు, సిబ్బంది సానుకూల ధోరణితో స్పందించాలని సూచించారు. అప్పుడే పిటిషనర్ల ముఖంలో సంతోషం చూడగలుగుతామని పేర్కొన్నారు.రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొనసాగుతున్న ప్రజావాణిని డివిజన్ స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం విస్తరించిందని, రానున్న



కాలంలో మండల స్థాయిలో కూడా ప్రజావాణిని నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని తెలిపారు. సీఎం ప్రజావాణిలో ఓపికతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, నిర్వాహకులు హర్ష, ఆనందిత, అభిషేక్, అఖిల్, సీఎం ప్రజావాణి అధికారులు రాకేష్ రెడ్డి, జగన్, సహదేవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# క్రెడిట్ కార్డు బిల్లును ఈఎంఐలోకి మారుస్తున్నారా..? లాభ, నష్టాలు ఇవే..




క్రెడిట్ కార్డు బిల్లు కట్టలేక చాలామంది ఇబ్బందులు పడుతూ ఉంటారు. అలాంటివారు బిల్లును ఈఎంఐ రూపంలోకి మారుస్తారు. ఇలా మార్చడం వల్ల బిల్లు తగ్గుతుందని, వాయిదాల రూపంలో కట్టవచ్చని అనుకుంటారు. ఇలా చేయడం వల్ల లాభ, నష్టాలు ఏంటి? అనే వివరాలు చూద్దాం.ఈ మధ్య అందరూ క్రెడిట్ కార్డ్ వాడుతున్నారు. క్రెడిట్ కార్డ్ లేనివారంటూ ఎవరూ కనిపించడం లేదు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలు అనే సంబంధం లేకుండా సామాన్యుల నుంచి వ్యాపారవేత్తల వరకు ప్రతీఒక్కరూ క్రెడిట్ కార్డ్ వాడుతున్నారు. అంతలా క్రెడిట్ కార్డ్ వినియోగం అనేది పెరిగిపోయింది. బ్యాంకులు కూడా తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు క్రెడిట్ కార్డులను తెగ జారీ చేస్తున్నాయి. కస్టమర్లకు ఫోన్ చేసి మరీ క్రెడిట్ కార్డు తీసుకుంటే అనేక డిస్కౌంట్స్ ఇస్తామంటూ ఆఫర్లు మీద ఆఫర్లు ఇస్తున్నాయి. ఈ ఆఫర్లకు ఆశపడి క్రెడిట్ కార్డు తీసుకునేవారు కూడా ఉన్నారు. అయితే క్రెడిట్ కార్డువాడేవారు చాలామంది బిల్లు కట్టలేక.. ఆ బిల్లును ఈఎంఐ రూపంలోకి మార్చుకుంటారు. ఇలా మార్చుకోవడం వల్ల ఎలాంటి నష్టాలు ఉంటాయి..? బిల్లును ఈఎంఐ రూపంలో కి మార్చుకోవడం వల్ల సిబిల్ స్కోర్ ఎఫెక్ట్ అవుతుందా అనే విషయాలు చూద్దాం.


**సిబిల్ స్కోర్ పెరిగే అవకాశం**

బిల్లును ఈఎంఐగా మార్చుకున్నప్పుడు.. టైమ్ ప్రకారం ఈఎంఐ చెల్లించాలి. ఇలాంటి సమయంలో మీ సిబిల్ స్కోర్ పెరుగుతుంది. అంతేకాకుండా క్రెడిట్ యుటిలైజేషన్ రేషియా పెరగకుండా చూసుకోవాలి. ఈ రేషియా 30 శాతంగా ఉంటుంది. దీనిని మించి మీరు ఖర్చు చేస్తే సిబిల్ స్కోర్ పడిపోతుంది. ఇక మీరు ఈఎంఐగా మార్చుకోవడం వల్ల బిల్లు చెల్లించాల్సిన సమయం కూడా పెరుగుతుంది.

**నష్టాలు ఇవే**

బిల్లును ఈఎంఐ రూపంలోకి మార్చుకున్నందుకు ప్రాజెసింగ్ ఫీజ్, జీఎస్టీతో పాటు ఇతర ఫీజులు చాలా ఎక్కువగా ఉంటాయి. ఈ ఛార్జీలను మీ క్రెడిట్ కార్డు నుంచే బ్యాంకులు తీసుకుంటాయి. ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోతే లేట్ ఫీజులు భారీగా ఉంటాయి. వీటిని గమనించుకుని క్రెడిట్ కార్డ్ బిల్లును ఈఎంఐ రూపంలోకి మార్చుకోవాలి. అవగాహన లేకుండా మార్చుకుంటే మీకే నష్టం జరుగుతుంది.

# గుడ్ న్యూస్.. త్వరలో కూత పెట్టనున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు.. డేట్ ఫిక్స్..




వందే భారత్ రైళ్లు ఇండియాలో విజయవంతం కావడం, ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో స్లీపర్ రైళ్లను కూడా తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. వీటి తయారీ వేగంగా జరుగుతుండగా.. త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఆ వివరాలు ఏంటో చూద్దాం.వందే భారత్ రైళ్లు ప్రస్తుతం దేశవ్యాప్తంగా సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. విడతల వారీగా ప్రధాన నగరాలన్నింటికీ ఈ సేవలను కేంద్రం ప్రవేశపెట్టింది. వందే భారత్ రైళ్ల రాకతో లగ్జరీతో పాటు వేగంగా ప్రయాణం చేయగలిగే సదుపాయం ప్రజలుకు అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ ట్రైన్లలో ఛైర్ కార్, నార్మల్ సిట్టింగ్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. స్లీపర్ క్లాస్ ప్రస్తుతం సర్వీసులు అందిస్తున్న వందే భారత్ ట్రైన్లలో అందుబాటులో లేదు. అయతే త్వరలో స్లీపర్ క్లాస్ ట్రైన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి.ఈ డిసెంబర్‌లో వందే భారత్ స్లీపర్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ క్లారిటీ ఇచ్చారు. మొదటి ప్రొటోటైప్ స్లీపర్ రైళ్లల్లో కొన్ని సమస్యలు గుర్తించగా.. వాటిల్లో మార్పులు చేస్తున్నారు. వీటి సరిచేసిన తర్వాత మెరుగైన నాణ్యతతో స్లీపర్ రైళ్లు రాబోతున్నట్లు ఆయన చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం, అత్యంత ప్రమాణాలతో కూడిన ప్రయాణం అందించేందుకు ఒక్క చిన్న నిర్లక్ష్యం కూడా లేకుండా తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు.

# తక్కువ ధరకే సరికొత్త ఇయర్ బడ్స్.. ఎంతసేపు పెట్టుకున్నా ఇబ్బందే ఉండదు..



మార్కెట్లోకి ఇటీవల కొత్త కొత్త ఇయర్ బడ్స్ వస్తున్నాయి.అత్యాధునిక ఫీచర్లు వీటిల్లో ఉంటున్నాయి. సాధారణంగా ఇయర్స్ బడ్స్ ఎక్కువసేపు వాడితే చెవికి కాస్త ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి ప్రాబ్లం లేకుండా తాజాగా ఒక కంపెనీ స్కిన్ ఫ్రెండ్లీ ఇయర్ బడ్స్‌ను మార్కెట్లోకి తెచ్చింది.ఇయర్స్ బడ్స్‌ను ఇటీవల ఎక్కువమంది వాడుతున్నారు. సింపుల్‌గా ఉండటంతో పాటు ట్రెండీగా ఉండటంతో స్మార్ట్‌ఫోన్ ఉపయోగించేవారందరూ ఇయర్స్ బడ్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఏఐ టెక్నాలజీ, వాయిస్ అసిస్టెంట్, నాయిస్ క్యాన్సలేషన్ అంటూ అనేక ఫీచర్లతో ఇయర్ బడ్స్ వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. తాజాగా సెన్‌హైజర్ అనే కంపెనీ సౌండ్‌ప్రొటెస్ ప్లస్ ఇయర్ బడ్స్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. దీని ధర ఎంత..? ఎలాంటి ఫీచర్లు ఉన్నాయి? అనే వివరాలు చూద్దాం. సాధారణంగా ట్రాఫిక్, ట్రావెలింగ్ సమయంలో డిస్టబెన్స్ వల్ల ఇయర్ బడ్స్‌లో వాయిస్ సరిగ్గా వినబడదు. కానీ సౌండ్‌ప్రొటెస్ ప్లస్ ఇయర్ బడ్స్ అలాంటి పరిస్థితుల్లో కూడా వాయిస్ క్లియర్‌గా వినిపించే ఫీచర్ తీసుకొచ్చారు. మూడు ఫిల్టర్లతో ఈ ఇయర్ బడ్స్‌ను ప్రవేశపెట్టారు.